# కంటైనర్ కిందికి దూసుకెళ్లిన కారు

- ప్రమాదంలో దంపతుల మృతి


కంటైనర్ కిందికి దూసుకెళ్లిన కారు. (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన భార్గవి, నవీన్‌రాజ్ (ఫైల్)

మునగాల, ఏప్రిల్ 22: రోడ్డుపై నిలిచి ఉన్న కంటైనర్ కిందికి కారు దూసుకెళ్లిన ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం సమీపంలో హెచ్‌పీ పెట్రోబంక్ ఎదుట సోమవారం చోటు చేసుకున్నది. ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన సామినేని నవీన్‌రాజ్ (29), భార్గవి (26) దంపతులు. నవీన్‌రాజ్ కృష్ణాజిల్లా గూడవల్లిలోని శ్రీచైతన్య కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తుండగా భార్గవి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ విజయవాడలో నివాసముంటున్నారు. ఈ నెల 20 భార్గవి పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు.. హైదరాబాద్‌లో ఉంటున్న నవీన్‌రాజ్ తల్లిదండ్రుల దగ్గరికి కారులో వచ్చారు. శనివారం పుట్టినరోజు వేడుకను బంధువుల మధ్య ఆనందంగా జరుపుకొన్నారు. సోమవారం ఉదయం కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరారు. మార్గమధ్యంలో ముకుందాపురం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన కంటైనర్ కిందికి దూసుకెళ్లింది. దాంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు రెండు జేసీబీలు, క్రేన్, ట్రాక్టర్ సాయంతో కంటైనర్ కింద ఇరుక్కున్న కారును బయటికి తీశారు. కారులో ఉన్న నవీన్‌రాజ్, భార్గవి మృతదేహాలు నుజ్జునుజ్జయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాద ఘటన పెట్రోల్‌బంక్ సీసీ కెమెరాలో నమోదైంది. బంక్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అంజిరెడ్డి తెలిపారు. సీఐ రామకృష్ణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

## విశాఖ-బెంగళూరు మధ్య 20 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తేతెలంగాణ): వేసవిలో ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో విశాఖపట్నం-బెంగళూరు మధ్య 20 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ నెల 27 నుంచి జూన్ 30 వరకు శని, ఆదివారాల్లో ఈ రైళ్ల సర్వీసులను అందించనున్నాయి. విశాఖపట్నం-బెంగళూరు (08549) రైలు శనివారం మధ్యాహ్నం 1.15 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు బెంగళూరు చేరుకోనుంది. బెంగళూరు -విశాఖ (08550) రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50కి బయలు దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3.10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఏనుగుల మంద సంచారంపై అప్రమత్తం

- మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నట్టు సమాచారం
- మందను ఎదుర్కొనేందుకు సిద్ధం
- అటవీ సంరక్షణాధికారి, పీసీసీఎఫ్ డోబ్రియాల్



హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): తాజాగా తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఏనుగుల మంద సంచరిస్తుందన్న సమాచారంతో రాష్ట్ర అటవీ శాఖ అప్రమత్తమైంది. ఏనుగుల మంద వస్తే ఆ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దూలపల్లి అటవీ అకాడమీలో ప్రత్యేకంగా అటవీశాఖ వర్క్‌షాప్ నిర్వహించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అటవీ ముఖ్య అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో అటవీశాఖ సంరక్షణ ప్రధానాధికారి, పీసీసీఎఫ్ ఆర్ఎం డొబ్రియాల్ పాల్గొన్నారు. ఇటీవలే మహారాష్ట్రలో సంచరిస్తున్న ఏనుగుల మంద నుంచి ఓ ఏనుగు తప్పిపోయి రాష్ట్రంలోకి ప్రవేశించిందని, అటవీశాఖ అధికారులు ఎంతో శ్రమించి దానిని తిరిగి మహారాష్ట్ర అడవుల్లోకి పంపించినట్టు ఆర్ఎం డొబ్రియాల్ ఈ సందర్భంగా చెప్పారు. ఏనుగుల మంద తిరిగి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే జరిగే సంక్షోభం గురించి వర్క్‌షాప్‌లో చర్చించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని పీసీసీఎఫ్ జిల్లా అధికారులకు సూచించారు. ఛత్తీస్‌గడ్‌కు చెందిన రిటైర్డ్ సీసీఎఫ్ పీవీ నరసింహారావు ఏనుగుల మందను ఎదుర్కోవడానికి ఆ రాష్ట్రంలో వారు ఉపయోగించిన వివిధ పద్ధతులను అధికారులకు ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. వరల్డ్ వైల్డ్ ఫండ్ ఇండియా (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) బోర్డు చైర్మన్ అనిల్ వీ ఏపూర్ తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) ఎంసీ ఫర్గెయిన్, పీసీసీఎఫ్ (ప్రొటెక్షన్-విజిలెన్స్) డైరెక్టర్ ఈలుసింగ్ మేరు, పీసీసీఎఫ్ (కంపా) డాక్టర్ సువర్ణ, అడిషనల్ పీసీసీఎఫ్ సునీతా భాగవత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి

- డ్రైవర్ల నిరసనతో కేసు నమోదు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): బస్సు ఆలస్యమవుతుందని ప్రైవేట్ ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ ప్రయాణికుడు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లాలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం బస్సు పక్కన పెట్టి డ్రైవర్ రాములు, కండక్టర్‌తో కలిసి భోజనానికి వెళ్లాడు. ఇదే సమయంలో వచ్చిన ప్రయాణికుడు నవాజ్ బస్సు ఇంకెప్పుడు బయలుదేరుతుందని వారిని ప్రశ్నించాడు. భోజనం చేసి వచ్చి బస్సును ప్లాట్‌ఫాం మీదికి తీసుకొస్తామని డ్రైవర్ రాములు చెప్పాడు. అయినా నవాజ్ బస్సు ఆలస్యమవుతుందని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. ఈ ఘటనను ఖండిస్తూ మిగతా డ్రైవర్లు సోమవారం డిపోలో నిరసన తెలిపారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్,కండక్టర్ కలిసి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కూడా స్పందించారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే పోలీస్‌శాఖ సహకారంతో హిస్టరీ షీట్స్ తెరుస్తామని హెచ్చరించారు. నిందితులపై చట్టప్రకారం ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందని ట్వీట్ చేశారు.














